డయల్ ఏ ట్యాంకర్ ద్వారా నీళ్లందిస్తున్నం

'నమస్తే తెలంగాణ' కథనానికి వివరణ ఇచ్చిన జలమండలి

సిటీబ్యూరో, మార్చి23, (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో నీటి కొరతపై నమస్తే తెలంగాణలో ఆదివారం ప్రచురించిన వారానికోసారి మంచినీళ్లు! కథనానికి జలమండలి అధికారులు స్పందించారు. డయల్‌ఎ ట్యాంకర్ ద్వారా అవసరమైన ప్రాంతాలకు నీరందిస్తున్నట్లు, గతంలో పలు ప్రాంతాల్లో వారానికి ఒకసారి లేదా నెలకు మూడు సార్లు మాత్రమే నీటిని అందించగా, ప్రస్తుతం మూడు నుంచి నాలుగు రోజులకు ఒకసారి సరఫరా చేస్తున్నట్లు వివరణ ఇచ్చారు.

భూములు వేలం వేస్తే ఉద్యమమే

హెచ్‌సీయూ విద్యార్థుల హెచ్చరిక

క్యాంపస్‌లో మాషల్ జులూస్‌కు పిలుపు

సిటీబ్యూరో: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను వేలం వేస్తే కాంగ్రెస్ సర్కారుపై యుద్ధం ప్రకటిస్తామని హెచ్‌సీయూ విద్యార్థులు హెచ్చరించారు. భూముల పరిరక్షణ కోసం యూనివర్సిటీ క్యాంపస్‌లో 'మాషల్ జులూస్'కు పిలుపునిచ్చారు. వర్సిటీలోని 5 వేల మంది విద్యార్థులు ఇందులో పాల్గొనాలని జేఏసీ ప్రతినిధులు పిలుపునిచ్చారు. వర్సిటీకి చెందిన 400 ఎకరాల భూములను వేలం వేస్తామన్న ప్రభుత్వ ప్రకటన వెనక్కి తీసుకునేదాకా నిరసనలు కొనసాగించాలని నిర్ణయించారు. వర్సిటీ పరిధి భూములన్నింటినీ రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. భూములను రిజిస్ట్రేషన్ చేయించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని జేఏసీ ప్రతినిధులు వర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌ను కలిసి విన్నవించినట్లు తెలిపారు.

సామాన్యులకు దూరంగా ఈత కొలను..!

సమ్మర్ వచ్చినా అందుబాటులోకి రాని సిమ్మింగ్ పూల్

మరమ్మతుల పేరిట అధికారుల కాలయాపన

సిటీబ్యూరో, మార్చి 23 (నమస్తే తెలంగాణ) సమ్మర్ వచ్చిందంటే చాలు చిన్నారుల నుంచి పెద్దలు ఈత కొలనులను ఆశ్రయిస్తుంటారు. కొంత మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు ప్రత్యేక శిక్షణ ఇప్పించి ఈత నేర్పిస్తుంటారు. మరికొందరు ఈత ద్వారా చక్కని ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చని ఆరాటపడుతుంటారు. ఐతే ప్రైవేట్ వ్యక్తులు నిర్వహించే స్విమ్మింగ్ పూల్స్ సామాన్యులకు దూరంగా ఉంటారు. ఇందుకు ఫీజుల భారమే కారణం. ఈ నేపథ్యంలోనే ప్రతి ఏటా వేసవిలో పేద, మధ్య తరగతి ప్రజల సౌకర్యార్థం జీహెచ్‌ఎంసీ దాదాపు 12 చోట్ల ఈత కొలనుల నిర్వహణ చేపడుతున్నది. మార్చి నెలాఖరు పూర్తవుతున్నా ఈత కొలనులను అందుబాటులోకి తీసుకురాలేదు. గడిచిన రెండు, మూడు రోజుల నుంచి వరుసగా ఈత కొలనులను ప్రారంభిస్తున్నది. సికింద్రాబాద్‌లో రెండు, ఎల్బీనగర్‌లో రెండు, చార్మినార్‌లో రెండు మాత్రమే అందుబాటులోకి తీసుకువచ్చారు. ఖైరతాబాద్‌లోని స్విమ్మింగ్ పూల్‌ను సోమవారం (నేడు) సాయంత్రంలోగా అందుబాటులోకి తీసుకువస్తామని చెబుతున్నారు. మిగిలిన ఐదు చోట్ల ఈత కొలనుల మరమ్మతుల దృష్ట్యా మరింత సమయం పట్టే అవకాశముందని స్పోర్ట్స్ విభాగం అధికారులు వెల్లడించారు. మొఘల్ పురలోని స్పోర్ట్స్ కాంప్లెక్సులో 2, చందూలాల్ బారాదరీ క్రీడా ప్రాంగణంలో 2, విజయనగర్ కాలనీ 2, వనస్థలిపురం రెడ్ వాటర్ ట్యాంక్ పక్కన, వనస్థలిపురం ఫేజ్ 4, గోల్కొండ క్రీడా ప్రాంగణంలో, అంబర్ పేట స్పోర్ట్స్ కాంప్లెక్సులో 2, అమీర్ పేట్ స్టేడియంలో, సికింద్రాబాద్, కూకట్‌పల్లి, సనత్ నగర్‌లో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో స్విమ్మింగ్ పూల్స్ నిర్వహణ ఉంటుంది. ఇప్పటికే కొన్ని చోట్ల అందుబాటులోకి వచ్చాయి. కాగా నెలకు ఒక వ్యక్తి సభ్యత్వ రుసుం రూ.500లు రోజూ గంట పాటు ఈత కొట్టే అవకాశం ఉంటుంది. https://sports.ghmc.gov.in/ వెబ్ లింకు ద్వారా రిజిస్టర్ అయి, లాగిన్ అయ్యాక.. ఈత కొలను సేవలు ఎంచుకుని ఫీజు చెల్లించాలి. రశీదును సంబంధిత కొలను వద్దనున్న జీహెచ్‌ఎంసీ అధికారికివ్వాలి. ఫిట్‌నెస్ సర్టిఫికెట్, 2 పాస్ పోర్టు సైజు ఫొటోలిచ్చి గుర్తింపు కార్డు పొందాలి. టీబీ, హెపటైటిస్ బి, తామర, ఇతర అనారోగ్య సమస్యలున్న వారిని అనుమతిస్తే ఇతరులకు అంటుకోవచ్చు. కొందరికి నీటిలో దిగితే ఫిట్స్ వస్తాయి. అందుకే డాక్టర్ సర్టిఫికెట్ తప్పనిసరి చేసినట్లు జీహెచ్ ఎంసీ అధికారులు తెలిపారు. జీహెచ్ ఎంసీ ఈత కొలనులోని నీటిని రోజూ నాణ్యమైన క్లోరిన్‌తో శుద్ధి చేస్తారు. స్నానాల గదుల్లో శరీరాన్ని శ్రుభం చేసుకుని స్విమ్ సూట్ దరించిన వారినే కొలనులోకి అనుమతిస్తారు. ప్రతి రోజు నలుగురు శిక్షకులు పర్యవేక్షిస్తారు. లైఫ్ గార్డులు అందుబాటులో ఉంటారు.

బాలికల భవిష్యత్తుకు భరోసానిద్దాం

అబ్బాయిలను బాధ్యతగా పెంచాలి : ఆర్పీ పట్నాయక్

సేవ్ ద గర్ల్ చైల్డ్ కార్యాలయం ప్రారంభం

బాలికల భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌పి పట్నాయక్

హైదరాబాద్, మార్చి 23 (నమస్తే తెలంగాణ) : సమాజంలో బాలికల భవిష్యత్తుకు రక్షణ నిస్తూ, వారికి భరోసాను ఇద్దామని ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ అన్నారు. ఆదివారం ఎర్రమంజిల్‌లో 'సేవ్ ద గర్ల్ చైల్డ్' కార్యాలయాన్ని చంచల్‌గూడ జైలు సూపరిండెంటెంట్ శివకుమార్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే బక్కిని నర్సింహులు, యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఫౌండర్ రాజేంద్ర పల్నాటితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో బాలికలు, మహిళలపై రోజురోజుకు అఘాయిత్యాలు, వేధింపులు పెరిగిపోతున్నాయన్నారు. నేటి సమాజంలో అమ్మాయిలను ప్రతి తల్లిదండ్రులు ధైర్యంగా పెంచాలన్నారు. అబ్బాయిలను కూడా బాధ్యతగా, ఆడపిల్లలను గౌరవించాలనే పెంచాలని అన్నారు. సేవ్ ద గర్ల్ చైల్డ్ నుంచి ఆడపిల్లల రక్షణపై అవగాహన కల్పిస్తూ వారి భద్రత కోసం పాటు పడాలన్నారు. ఈ కార్యక్రమంలో కళింగ కృష్ణ, డా.ప్రవంతి, డాక్టర్ చక్రపాణి, సౌజన్య, గీత, స్వప్న, అపర్ణ, శరణ్య, సునీత, హిమబిందు, పద్మజ, కొమటి రమేశ్ బాబు, బి.రాజేశ్, గంగాధర్, హరి ప్రకాశ్, కొన్నె దేవేందర్, జంగయ్య, కొక్కుల ప్రశాంత్, నరేశ్ పాల్గొన్నారు.

గట్టి భద్రత నడుమ.. ఐపీఎల్ టోర్నీ

సిటీబ్యూరో, మార్చి 23(నమస్తే తెలంగాణ): ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో ఆదివారం ప్రారంభమైన 18వ ఎడిషన్ ఐపీఎల్ క్రికెట్ టోర్నీకి కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసినట్లు రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. భద్రత ఏర్పాట్లను ఆదివారం పర్యవేక్షించిన ఆయన.. స్టేడియం పరిసరాల్లో ఉన్న సీసీటీవీల నిర్వహణ, భారీ స్థాయిలో ప్రేక్షకులు వచ్చిన నేపథ్యంలో ఎలాంటి ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేసినట్లుగా తెలిపారు. విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, మ్యాచ్ ముగిసిన తర్వాత ప్రేక్షకులు వెళ్లే మార్గంలో ఎలాంటి తోపులాటలు, తొక్కిసలాటలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు.

విశ్వ వసు నామ సంవత్సర పంచాంగం ఆవిష్కరణ

హైదరాబాద్, మార్చి 23 (నమస్తే తెలంగాణ) ధూప దీప నైవేద్య అర్చన సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన విశ్వ వసునామ సంవత్సర పంచాంగాన్ని ఆదివారం దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హైదరాబాద్‌లోని మినిస్టర్స్ కాలనీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండేందుకు అర్చకులు భగవంతుడిని ప్రార్థించాలని కోరారు. అర్చకులకు ప్రతినెలా వేతనాలు అందే విధంగా చూస్తున్నట్లు, త్వరలో ధూప దీప నైవేద్య అర్చకులకు మెరుగైన వేతనం అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్, ధూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌలతాబాద్ వాసుదేవ శర్మ తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి శ్రీరామనవమి వేడుకలకు రావాలి

వచ్చే నెల 6,7 తేదీల్లో భద్రాచలంలో జరిగే శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొనాలని కోరుతూ ఆదివారం మంత్రి కొండా సురేఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు ఇతర మంత్రులను ఆహ్వానించారు. ఈ మేరకు ఆమె అధికారులు, ఆలయ అర్చకులతో కలిసి సీఎం నివాసంలో సీఎంతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిశారు. అనంతరం శ్రీరామనవమి కళ్యాణ మహోత్సవ పోస్టర్‌ను సీఎం మంత్రులతో కలిసి ఆవిష్కరించారు. 6న సీతారామ కళ్యాణం, 7న మహా పట్టాభిషేక కార్యక్రమం జరుగనుంది. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి సంబంధించి అవసరమైన భూసేకరణ, ఇతర వివరాలను సీఎం అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూసేకరణ, నిధులకు సంబంధించిన పూర్తి వివరాలు అందించాలని వారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్ తదితరులు సీఎంను కలిసినవారిలో ఉన్నారు.

కళాకారులకు వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని కోరుతూ అభివాదం చేస్తున్న కళాకారులు

కళాకారులను బీఆర్ఎస్ ఆదుకుంటే...

కాంగ్రెస్ రోడ్డున పడేసింది

తెలంగాణ కళాకారుల వేదిక కమిటీ వ్యవస్థాపకులు కామల్ల ఐలన్న

జవహర్‌నగర్, మార్చి 23: కళాకారులను బీఆర్ఎస్ ఆదుకుని ఉద్యోగాలు ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కళాకారులను రోడ్డున పడేస్తుందని తెలంగాణ కళాకారుల వేదిక కమిటీ వ్యవస్థాపకులు కామల్ల ఐలన్న అన్నారు. తెలంగాణ కళాకారుల వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎర్రవల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐలన్న హాజరై మాట్లాడారు. రాజకీయ పార్టీలు, ఉద్యమ సంస్థలు కళాకారులను మోసం చేశాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్న కళాకారులవైపు కన్నెత్తి చూడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కళాకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, కళాకారులకు సంక్షేమ నిధులు రూ.1000 కోట్ల కేటాయించి పెన్షన్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కళాకారుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ బైరాగి, ప్రధాన కార్యదర్శి వెంకటాచారి, రమేష్, ఎర్రమల్లేష్, శరత్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య

నూతన కార్యవర్గం ఏర్పాటు



కొత్తగా ఎన్నికైన తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య కార్యవర్గం

సిటీ బ్యూరో, మార్చి 23 (నమస్తే తెలంగాణ): తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య కొత్త కార్యవర్గం ఏర్పాటైంది. ఆదివారం భువనగిరిలోని స్వర్ణగిరి ఆలయ ప్రాంగణంలో జరిగిననీ ఎన్నికలకు అన్ని జిల్లాల నుంచి సమాఖ్య సభ్యులు హాజరయ్యారు. సమాఖ్య ఎన్నికల అధికారి శ్రీ దేశపతి రాజశేఖర శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికలలో సమాఖ్య శాశ్వత చైర్మన్ గా వెన్నంపల్లి జగన్మోహన్ శర్మ, అధ్యక్షులుగా మోత్కూరి రామేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా వైద్య ప్రభాకర్ శర్మ, కోశాధికారిగా సముద్రాల విజయ సారథిని ఎన్నుకున్నారు. కాగా కొత్త కార్యవర్గాన్ని గ్రేటర్ హైదరాబాద్ కమిటీ సత్కరించింది. ఉదయమర్రి కృష్ణ మూర్తి, మరుమామల వెంకటరమణ శర్మ, జోషి గోపాల్ శర్మ ముఖ్య అతిథులుగా హాజరైన కార్యక్రమంలో మునిపల్లె శ్రీనివాస్, భాస్కరమూర్తి, రఘునందన్ , నాగరాజు, శశిధర్, అనిల్ కుమార్, కల్పవల్లి, శ్రీనివాస్, జయతులసి, రాఘవరావు, వాణిశ్రీ, వివిధ జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

నెక్లెస్ రోడ్ లో డీవీటీపై అవగాహన

డీవీటీపై అవగాహన వాక్ లో వైద్యులు, విద్యార్థులు

ఖైరతాబాద్, మార్చి 23: రక్తనాళాల్లో గడ్డ కట్టించే డీప్ వీన్ త్రంబోసిస్ వ్యాధిపై కిమ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వ్యాస్కులర్ సైన్సెస్, వ్యాస్కులర్ సొసైటీ ఆఫ్ ఇండియా, వాస్కులర్ ఫౌండేషన్, వ్యాస్కులర్ సొసైటీ ఆఫ్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, బయోలాజికల్ ఈ లిమిటెడ్, దపుట్ డాక్టర్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్ లోని జలవిహార్ వద్ద అవగాహన వాక్ నిర్వహించారు. ఈ వాక్‌ను కిమ్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బి భాస్కర్ రావు, వాస్కులర్, ఎండో వాస్కులర్ విభాగం సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ నరేంద్ర నాథ్ మేదతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగేంద్ర పర్వతనేని, డాక్టర్ జగదీష్దా, డాక్టర్ సంతోషి, డాక్టర్ కరణ్, డాక్టర్ అతిరథ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

విందుల పేరుతో డబ్బులు వృథా చేయొద్దు

జస్టిస్ చంద్రకుమార్

ఖైరతాబాద్, మార్చి 23 : ఇఫ్తార్ విందుల పేరుతో ప్రభుత్వం ప్రజాధనాన్ని వృథా చేయొద్దని రిటైర్డ్ జస్టిస్ చంద్ర కుమార్ సూచించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ముస్లింలతో పాటు ఇతర వర్గాలకు చెందిన పాఠశాలలు, హాస్టళ్లు, వసతి గృహాలు దీనావస్థలో ఉన్నాయన్నారు. కోట్లాది రూపాయల ఇతర వాటికి ఖర్చు చేయడం వల్ల మళ్లీ పన్నుల రూపంలో ప్రజలపై భారం పడుతుందన్నారు. ఆ డబ్బులను ప్రజా సంక్షేమానికి వినియోగించాలన్నారు. ఈ సమావేశంలో సొగరా బేగం, లుబ్నా సర్వత్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

నిర్మలకు నంది అవార్డును ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి, తదితరులు

సేవాభావంతో పని చేసినప్పుడే సమాజంలో గుర్తింపు

ఎమ్మెల్సీ మధుసూదనాచారి

కాచిగూడ, మార్చి 23: సేవా భావంతో ప్రజల కోసం పనిచేసినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని ఆ దిశగా నేటి యువత మానవతా దృక్పథంతో ముందుకు రావాలని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. లెజెండ్ సోషల్ సర్వీసెస్, కల్చరల్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాలను ఆదివారం కాచిగూడ హోటల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మధుసూదనాచారి హాజరై వివిధ రంగాల్లో సేవలందించి,రాణించిన మహిళలకు విశిష్ట ఉగాది పురస్కారాలు అందజేశారు. అందులో పేద, మధ్యతరగతి ప్రజలకు అనునిత్యం సేవలు అందించినందుకు గాను నిర్మల అంజు ముదిరాజ్ కు నంది అవార్డును ఎమ్మెల్సీ అందజేశారు. కార్యక్రమంలో లెజెండ్ సోషల్ సర్వీసెస్ కల్చరల్ ఆర్గనైజేషన్ ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ మూర్తి, గంగాధర్, చంద్రమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిన్ను నువ్వు తెలుసుకోవడమే అసలైన విద్య

సిటీబ్యూరో, మార్చి23, (నమస్తే తెలంగాణ): ప్రతి ఒక్కరిలో ఉండే శక్తి సామర్థ్యాలను వెలికి తీసేదే అసలైన విద్య అని సామాజిక కార్యకర్త, రామకృష్ణ మఠం వాలంటీర్ ఆరేపాటి వెంకట నారాయణ రావు అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ ప్యాట్నీ సెంటర్ లోని హరిహర కళాభవన్ లో శాంతినికేతన్ విద్యాసంస్థల శాన్ స్కూల్ వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. భారత్ ను విశ్వ గురువుచేయాలన్న స్వామి వివేకానంద కలను విద్యార్థులే సాకారం చేయగలరని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, పతకాలు అందజేశారు. శాంతినికేతన్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ యాజమాన్యం, ప్రిన్సిపాల్స్, యోగ గురువు లివాంకర్, మణిశంకర్ మణికంఠన్, శ్రీవిద్య, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మాటకు విలువ లేదా..?

క్యాంపు కార్యాలయానికి స్థలం ఇవ్వకుండా సబ్ స్టేషన్‌కు అంగీకారం

బంజారాహిల్స్ రోడ్ నెం10లో సబ్ స్టేషన్ కోసం కేటాయించిన స్థలం

బంజారాహిల్స్, మార్చి 23 : బంజారాహిల్స్ రోడ్డు నెం 10 లోని పలు బస్తీలు, కాలనీల్లో నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు టీజీపీడీసీఎల్ ఆధ్వర్యంలో కొత్తగా 33/11 కేవీ ఇండోర్ సబ్ స్టేషన్ నిర్మించనున్నారు. దీనికోసం షేక్‌పేట మండలం సర్వే నెంబర్ 403, టీఎస్ నెం 4, బ్లాక్ జీ వార్డు10 లో1500 గజాల స్థలాన్ని కేటాయించారు. గత ఏడాది డిసెంబర్‌లో విద్యుత్‌శాఖ నుంచి సబ్ స్టేషన్ కోసం స్థలం కావాలంటూ ప్రతిపాదనలు రావడంతో నెలన్నర క్రితం షేక్‌పేట రెవెన్యూ అధికారులు పంచనామా చేసి స్థలాన్ని విద్యుత్‌శాఖకు అప్పగించారు. ఇక్కడ సుమారు రూ. 4 కోట్ల వ్యయంతో సబ్ స్టేషన్ నిర్మాణం కోసం ప్రణాళికలు రూపొందిస్తోంది. కాగా ఈ సబ్ స్టేషన్ నిర్మాణం కోసం స్థలం కేటాయింపు విషయంలో తనకు ఏ మాత్రం సమాచారం ఇవ్వకుండా రెవెన్యూ శాఖ, విద్యుత్‌శాఖ నిర్ణయం తీసుకోవడంపై ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆగ్రహం వ్యక్తం చేయడం చర్చనీయాంశంగా మారింది. తనకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం కోసం1000 గజాల స్థలం ఇవ్వాలంటూ ఏడాదిన్నర నుంచి అడుగుతుంటే పట్టించుకోవడం లేదని, తనకు తెలియకుండా సబ్ స్టేషన్ నిర్మిస్తే తాను ఎందుకు ఊరుకుంటానంటూ ఎమ్మెల్యే దానం నాగేందర్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. దీంతో సబ్ స్టేషన్ నిర్మాణం ప్రారంభం అవుతుందా లేదా అనే విషయంపై విభిన్నమైన అభిప్రాయాలున్నారు. ఇక్కడ సబ్ స్టేషన్ నిర్మిస్తే అత్యవసర పరిస్థితుల్లో సమీపంలోని సబ్ స్టేషన్ల పరిధిలో సైతం నాణ్యమైన విద్యుత్‌ను అందించగలుగుతామని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. మొత్తం మీద ఎమ్మెల్యే దానం నాగేందర్ అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యల అనంతరం సబ్ స్టేషన్ నిర్మాణం జరుగుతుందా.. లేకపోతే ఎమ్మెల్యే ఒత్తిడితో ఈ స్థలాన్ని క్యాంపు కార్యాలయానికి కేటాయిస్తారా అని స్థానికంగా ఉత్కంఠ నెలకొంది.

అనాథపిల్లలు, వృద్ధుల కోసం ..

వాక్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఆర్టీ వ్యవస్థాపకులు మర్రి లక్ష్మణ్ రెడ్డి

ఖైరతాబాద్, మార్చి 23 : విద్యార్థులు, వృద్ధులకు తమ వంతు సాయం అందించేందుకు ఎఎన్వీఎస్ఎ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్డులోని జలవిహార్ వద్ద వాక్ ఫర్ హోప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఎల్ఆర్టీ వ్యవస్థాపకులు మర్రి లక్ష్మణ్ రెడ్డి హాజరై వాక్‌ను ప్రారంభించారు. వాక్ ద్వారా సమకూర్చిన మొత్తాన్ని అనాథపిల్లలు, వృద్ధుల సంక్షేమానికి వినియోగిస్తామని నిర్వాహకులు తెలిపారు. తెలంగాణ, ఏపీలో వృద్ధాశ్రమాలు నిర్మించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు.

తాజ్‌డెక్కన్ లో ఎడ్యుకేషన్ ఫెయిర్

సిటీబ్యూరో, మార్చి 23, (నమస్తే తెలంగాణ):బంజారా హిల్స్ లోని తాజ్ డెక్కన్‌లో ఆదివారం నిర్వహించిన యూకె, ఐర్లాండ్ ఎడ్యుకేషన్ ఫెయిర్ అట్టహాసంగా సాగింది. ఐ20 ఫీవర్ ఆధ్వర్యంలో నిర్వహించిన యూకే, ఐర్లాండ్‌లోని 20కి పైగా ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల ప్రతినిధులు హాజరయ్యారు. అంతర్జాతీయ స్థాయిలో అందుబాటులో ఉన్న కోర్సులు, కెరీర్ అవకాశాలు, ఇంటర్నేషిప్‌ల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఐ20ఫీవర్ వ్యవస్థాపకుడు నవీన్ యాథాపు మాట్లాడుతూ సరైన విద్యార్థులను గొప్ప విశ్వవిద్యాలయాలకు అనుసంధానించడమే లక్ష్యమని అన్నారు.

అనిధ్య ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

సిటీ బ్యూరో, మార్చి 23 (నమస్తే తెలంగాణ): అనిధ్య అవెన్యూస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో తలసీమియా బాధితుల కోసం ఆదివారం మియాపూర్ మాతృశ్రీ నగర్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 150 మందికి పైగా రక్తదానం చేశారు. ఈకార్యక్రమంలో అనిధ్య అవెన్యూస్ ఎండి సాంబమూర్తి పెండ్య తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు పిల్లి శ్రీనివాసరావు

మున్నూరు కాపులందరూ ఐక్యత చాటాలి

అధ్యక్షుడు పిల్లి శ్రీనివాసరావు

సికింద్రాబాద్, మార్చి 23: తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహా సభ ఆధ్వర్యంలో సర్వ సభ్య సమావేశాలు నిర్వహించారు. నామలగుండు బిఎన్నార్ గార్డెన్ లో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు పిల్లి శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. మున్నూరు కాపులందరూ జీవిత కాల సభ్యత్వం తీసుకుని, ఐక్యత చాటాలని అన్నారు. సికింద్రాబాద్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు, మహాసభ ఎగ్జిక్యూటివ్ మెంబర్ చేపూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్నూరు కాపు సోదరీ సోదరీమణులు ఐక్యతను చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో గండు సతీష్, మహాసభ సెక్రటరీ ఏనుగుల హరీష్, చామకూర సుజాత, దండు నరేందర్, కోట శంకర్, దయానంద్, నర్సింగ్ రావు, లక్ష్మీప్రియ, మంజుల, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

'ప్రపంచ సుందరి పోటీలను వ్యతిరేకించాలి'

చిక్కడపల్లి, మార్చి 23: మహిళా ఆకాంక్షలకు వ్యతిరేకంగా జరిగే ప్రపంచ సుందరి పోటీలను మహిళలు అంతా వ్యతిరేకించాలని పలువురు మహిళా సంఘాల నాయకురాలు అన్నారు. మిస్ వరల్డ్ పోటీలు రద్దు చేసేంతవరకు పోరాడుదాం వారు పిలుపునిచ్చారు. ప్రగతి శీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రపంచ సుందరి పోటీలను వ్యతిరేకిస్తూ ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం రాష్ట్ర అధ్యక్షురాలు అనసూయ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పీవోడబ్ల్యూ జాతీయ నాయకురాలు సంధ్య మాట్లాడుతూ ప్రపంచ సుందరి పోటీలను వ్యతిరేకిద్దామని, అందాల పోటీలు మహిళా సాధికారతకు సంకేతమా అని ప్రశ్నించారు. జాతీయ నాయకులు ఝాన్సీ , ఐద్వా అధ్యక్షులు అరుణ జ్యోతి, జ్యోతి, రచయిత్రులు కమల, బండారు విజయ, శాంత తదితరులు పాల్గొన్నారు.